క్లుప్తంగా

నేటి అడుగులే.. రేపటి భవిష్యత్‌ శిఖరాలు

బడంగ్‌పేట్‌: అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌ డే సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథకురాలు సీఎస్‌ రాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల నేటి అడుగులే రేపటి భవిష్యత్‌ శిఖరాలు అన్నారు. సమాజంలో మంచితో పాటు చెడు పెరుగుతోంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను గమనిస్తూ విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్‌ డైరెక్టర్‌ అలేఖ్య, ప్రిన్సిపాల్‌ వనజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

21న తైబజార్‌కు వేలం

కందుకూరు: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే తైబజార్‌కు 2025–26 సంవత్సరానికి గాను ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు పంచాయతీ కార్యలయం వద్ద ప్రత్యేకాధికారి బి.సరిత ఆధ్వర్యంలో వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.పది వేలు డిపాజిట్‌ చేయాలన్నారు. వేలం దక్కించుకున్న వారు మూడు రోజుల్లో 50 శాతం, మిగతా 50 శాతం నగదును డిసెంబర్‌ నెలాఖరు వరకు పూర్తిగా చెల్లించేలా అగ్రిమెంట్‌ చేసుకుని, ఒకరి షూరిటీతో పంచాయతీకి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అలా చెల్లించని ఎడల వేలం రద్దు చేసి రెండో స్థానంలో ఉన్న వేలం పాటదారుకి అప్పగించాల్సి ఉంటుందన్నారు. చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వబడదన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

తుక్కుగూడ: మహేశ్వరం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారికి తుక్కుగూడ ఔటర్‌ రింగు రోడ్డు ఎగ్జిట్‌–14 వద్ద కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలను క్రేన్ల సహాయంతో వేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన డైరెక్టర్లకు సన్మానం



మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: మహేశ్వరం మార్కెట్‌ కమిటీ నూతన డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన మండల పరిధిలోని కందుకూరు, సరస్వతిగూడకు చెందిన బి.ప్రశాంత్‌కుమార్‌, కె.విష్ణువర్ధన్‌రెడ్డిలను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల మాజీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డిల్లీ శ్రీధర్‌ ముదిరాజ్‌, ఎండీ రహీమ్‌, ఏ.మహేందర్‌, బి.మల్లేశ్‌, కె.శ్రీనివాస్‌, కె.ఇంద్రసేన, రాజ, వంశీ, ఎండీ మస్తాన్‌, వినోద్‌, జి.కుమార్‌ పాల్గొన్నారు.

వారాంతపు సంత@ రూ.1.68 కోట్లు



మున్సిపల్‌ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

తుక్కుగూడ: తుక్కుగూడ వారపుసంత (తైబజార్‌) 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను బహిరంగ వేలమును సోమవారం పుర కార్యాలయంలోని సమావేశం మందిరంలో మున్సిపల్‌ కమిషనర్‌ ఏ.వాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది సభ్యులు పాల్గొన్నారు. ఇందులో అత్యధిక వేలం పాట పాడి రూ.1 కోటి 68 లక్షల 78వేలకు తుక్కుగూడకు చెందిన మద్దుల చంద్రశేఖర్‌రెడ్డి దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. రావిర్యాల సంత వేలమును వాయిదా వేశామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్‌ టి.పర్వతాలు, సీనియర్‌ అసిస్టెంట్‌ మల్లేశ్‌, వ్యాపారులు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వకుంటే తాళాలు పగులగొడుతాం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగయ్య



ఎంపీడీఓ వెంకటమ్మకు వినతిపత్రం అందజేస్తున్న డబుల్‌ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం/మంచాల: పేదలకు కేటాయించిన డబుల్‌ బెడ్రూం ఇళ్లను వెంటనే వారికి అప్పగించాలని.. లేదంటే తాళాలు పగులగొట్టి గృహప్రవేశాలు చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రావుల జంగయ్య హెచ్చరించారు. నోముల వద్ద నిర్మించిన డబుల్‌ బెడ్రూం ఇళ్లను తమకు అప్పగించాలని లబ్ధిదారులు సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌ స్థాయి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రావుల జంగయ్య మాట్లాడుతూ.. మంచాల మండలం నోముల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 100లో నిర్మించిన డబుల్‌ బెడ్రూం ఇళ్లను నోములకు చెందిన 31 మంది, మంచాలకు చెందిన 30 మందికి, లింగంపల్లికి చెందిన 30 మందికి, చెన్నారెడ్డిగూడకు చెందిన ఐదుగురికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేటాయించారన్నారు. ఇప్పటికి వారికి ఇళ్లను అప్పగించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలతో సంబంధం లేదని పేదలకు వెంటనే ఇళ్లను అప్పగించాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌, జిల్లా కలెక్టర్లకు పలుమార్లు ఫిర్యాదు చేసామని.. ఇప్పుడు మళ్లీ ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించే డివిజన్‌ స్థాయి ప్రజావాణిలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌, బాల్‌రాజ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పరమేశ్‌, భిక్షపతి పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి

ప్రజావాణిలో ఐదు దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ డివిజన్‌ కార్యాలయ అధికారి భాను తెలిపారు. మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్‌ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ అర్జీలు స్వీకరించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం పసుమాముల రెవెన్యూ పరిధిలోని 386/1 సర్వేనంబర్‌లో గల చెరువు శిఖం భూమిని కొంతమంది ప్లాట్లుగా చేసి విక్రయించి అక్రమ నిర్మాణాలను చేపడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. మూడు ధరణి, మరొకటి డబుల్‌ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన అర్జీలు వచ్చాయన్నారు. ఆయా శాఖలకు ఈ అర్జీలు పంపి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

యువ నాయకుడు కృష్ణ

కద్లాల్‌: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని యువ నాయకుడు కొప్పు కృష్ణ అన్నారు. ఇటీవల సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీల్లో కద్లాల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌(బాలుర) విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. త్వరలో ఢిల్లీ వేదికగా నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలబడనున్నారు. ఈ మేరకు జాతీయ పోటీలకు ఎంపికైన తరుణ్‌, అరవింద్‌, ఉదయ్‌, సాయి, నాని, కిరణ్‌, శశివర్ధన్‌, పీఈటీ భీముడు, హెచ్‌ఎం జంగయ్యలను ఉదయ్‌, సాయి, నాని,కిరణ్‌, శశివర్ధన్‌లను అదే విధంగా పీఈటీ భీముడు, హెచ్‌ఎం జంగయ్యను ప్రత్యేకంగా ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా కొప్పు కృష్ణ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై, పాఠశాలకు, మండలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రం సత్తా చాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్‌ డ్రెస్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్‌ యువజన సంఘాల నాయకులు కాలె వెంకటేశ్‌, ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు అశోక్‌, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు సురేశ్‌, మహేశ్‌, శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యావతమ్మను సన్మానిస్తున్న లక్ష్మణ్‌ తదితరులు

ఆమనగల్లు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని మాజీ కౌన్సిలర్‌ లక్ష్మణ్‌ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి రూ.5 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయురాలు విద్యావతమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శంకర్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలు ఎండలో పనిచేయొద్దు

ఎంపీడీఓ బాలశంకర్‌

మంచాల: ఉపాధిహామీ కూలీలు ఎండలో పని చేయవద్దని ఎంపీడీఓ బాలశంకర్‌ సూచించారు. సోమవారం మంచాల మండల కార్యాలయంలో వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధిహామీ పథకం–వైద్యశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే పనిచేయాలన్నారు. కూలీలు వదులుగా ఉండే లేత రంగు దుస్తులు ధరించాలన్నారు. కూలీలకు పని ప్రదేశంలో నీడ కల్పించాలన్నారు. తాగునీరు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు, మెడికల్‌ కిట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే నీడకు తీసుకెళ్లి గాలి తగిలేలా చూడాలన్నారు. తడి బట్టతో శరీరం తుడుస్తూ ఓఆర్‌ఎస్‌ తాపాలన్నారు. ప్రథమచికిత్స అనంతరం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచాల ప్రాథమిక వైద్యశాల వైద్యుడు శ్రావణ్‌కుమార్‌, సూపర్‌వైజర్‌ సతీష్‌, ఈసీ విమల తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ ఎత్తివేయాలి



ఆమనగల్లు: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు పత్యానాయక్‌

ఆమనగల్లు: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ వేటు వేయడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు పత్యానాయక్‌ అన్నారు. ఈ మేరకు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని హైదరాబాద్‌–శ్రీశైలం రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పత్యానాయక్‌ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. జగదీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు. రుణమాఫీ సగానికిపైగా రైతులకు కాలేదన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలో వందశాతం రుణమాఫీ కాలేదని ఎద్దేవా చేశారు. రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నిరంజన్‌గౌడ్‌, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పంతునాయక్‌, పార్టీ నాయకులు విజయ్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్‌, బాలస్వామి, వెంకటేశ్‌, రమేశ్‌, శివకుమార్‌, సైదులుగౌడ్‌, గణేశ్‌, శ్రీకాంత్‌, పంతునాయక్‌, మాల్యానాయక్‌, మహేశ్‌నేత, యాదగిరి, ప్రసాద్‌, రమేశ్‌, జగన్‌, శ్రీను, గణేశ్‌ నాయక్‌ పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలో మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

తుర్కయంజాల్‌: మున్సిపల్‌ పరిధిలోని కమ్మగూడలో కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం సత్యనారాయణ స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి. సోమవారం రాష్ట్ర రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, మాజీ కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్‌, నాయకులు శివ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న వీరశైవ జంగమ అర్చక సంఘం నాయకులు

హయత్‌నగర్‌: తెలంగాణ వీరశైవ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించారు. సోమవారం పెద్దఅంబర్‌పేట మున్సిపల్‌ పరిధి కుంట్లూరులోని బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి రూపొందిన ఉగాది క్యాలెండర్‌, శివకోటి పంచాక్షరి నామాల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జంగమ సమాజం అధ్యక్షుడు రుమాల విశ్వేశ్వరయ్య, అర్చక సంఘం గౌరవ అధ్యక్షుడు జి.ఎం విశ్వేశ్వరయ్య, అధ్యక్షుడు వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శివకోటి పుస్త ముద్రణ దాత శ్రీకాంత్‌, శివగీత ప్రచార సంఘం పీఠాధిపతి సోమేశ్వర స్వామి, ఆగమ పరిషత్‌ అధ్యక్షుడు పరమేశ్వరయ్య, సంఘం నాయకులు రాజశేఖర్‌, నందీశ్వర్‌, నరేందర్‌, శైలావతి, జగదీశ్వర్‌, మహేష్‌, నాగభూషణం, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు బాధ్యతారహితం

కద్లాల్‌: అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు పూర్తి బాధ్యతారహితమని.. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్‌, ఇతర బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి నోటికి నల్ల వస్త్రం కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులపై ఎన్నికల ముందు చూపిన కపట ప్రేమ, ఇప్పుడు ఎక్కడ పోయిందని విమర్శించారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలేకానీ.. బట్టలూడదీసి కొడతా, రోడ్లపై ఉరికిస్తా అని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడడం సరికాదన్నారు. కేసీఆర్‌పై ఇష్టానుసారం మాట్లాడడం సబబుకాదన్నారు. అసెంబ్లీ వేదికగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది గ్రామాలను అథారిటీలో కలపండి

మంత్రి శ్రీధర్‌బాబుకు మండల నేతల వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌ సిటీ అథారిటీలో కందుకూరు మండల పరిధిని మొత్తాన్ని కలపాలని కోరుతూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన శ్రీధర్‌బాబును కలిసి నాయకులు.. మండల పరిధిలో 35 పంచాయతీలు ఉండగా 26 పంచాయతీలను మాత్రమే ఫ్యూచర్‌ సిటీ అథారిటీలో కలిపారన్నారు. మిగిలిన నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్‌, పెద్దమ్మతండా, దావూద్‌గూడ పంచాయతీలను విస్మరించారన్నారు. తమను మండలంలోని ఇతర గ్రామాల మాదిరిగానే ఫ్యూచర్‌ సిటీలో కలిపేలా చూడాలని మంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల కోఆర్డినేటర్‌ ఎండీ అఫ్జల్‌ బేగ్‌, డైరెక్టర్‌ పాండురంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌ బి.శ్రీనివాస్‌, నాయకులు ఎస్‌.వెంకటేష్‌, ఎ.నరసింహ, ఐ.రవీందర్‌, ఎన్‌.శ్రీధర్‌, ఐ.రాకేష్‌గౌడ్‌, ఎం.గణేష్‌, ఎం.ఆంజనేయులు, ఎ.బాలయ్య, జి.మాధవరెడ్డి, వి.బాబు, ఎండీ హిందూ, ఆరోగ్యరెడ్డి, కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

సీఐటీయూ మండల కన్వీనర్‌ బాల్‌రాజు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సోమవారం కందుకూరు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌ బుట్టి బాల్‌రాజు మాట్లాడారు. ఆశ వర్కర్లు 20 ఏళ్లుగా సేవలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆశ వర్కర్లను పర్మినెంట్‌ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తూ, నెలకు రూ.18 వేల వేతనం అమలు చేసేలా జీఓ జారీ చేయాలన్నారు. ఈఎస్‌ఐ, జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 19న కలెక్టరేట్ల వద్ద 21న ఆస్పత్రుల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 24న ఛలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సరస్వతి, చంద్రకళ, ముంతాజ్‌బేగం, అఫ్రోజ్‌, అనిత, రేణుక, శారద, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నీరు వృథా



రావిర్యాలలో వృథాగా పోతున్న తాగునీరు

తుక్కుగూడ: భానుడి భగభగలకు భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో మున్సిపల్‌ పరిధిలోని ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మున్సిపాలిటీలో ప్రజల అవసరాల కోసం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ ఆధ్వర్యంలో రోజుకు 4మిలియన్‌ లీటర్ల తాగునీటి సరఫరా చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రభుత్వం సరఫరా చేసే నీటిపైనే ఆధారాపడుతున్నారని.. ప్రజల అవసరాల మేరకు నీటి సరఫరా చేస్తున్నామని జల్‌పల్లి హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ డీఈఈ శ్రీనివాస్‌ వెల్లడించారు. మున్సిపల్‌ పరిధిలోని కొన్ని కాలనీల్లో నల్లాలకు ట్యాప్‌లు బిగించక నీరు వృథాగాపోతోంది. నీటి వృథా అరికట్టడం, వినియోగంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగిరం చేయాలి



అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌కు అర్జీని అందజేస్తున్న తుమ్మలూరు గ్రామస్తులు

మహేశ్వరం: అసంపూర్తిగా ఉన్న తుమ్మలూరు–మహేశ్వరం బీటీ డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తుమ్మలూరు వాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తుమ్మలూరు–మహేశ్వరం బీటీ డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారని వివరించారు. కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించగా పలువురు క్షతగాత్రులయ్యారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుమ్మలూరు–మహేశ్వరం బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

కల్యాణోత్సవం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్‌లో వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువులో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా ఆశ్లేషారెడ్డి, వంశీచంద్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌ యాదవ్‌ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్‌ రాజ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ శ్రీశైలం, పీఏసీఎస్‌ చైర్మన్‌ కేశవరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌ బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, నాయకులు భగవాన్‌రెడ్డి, మల్లేశ్‌, జీఎల్‌ఎన్‌రెడ్డి, జగ్గారెడ్డి, రమేశ్‌, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రామాచార్యులు, గోపాలాచార్యులు, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌ యాదవ్‌ తదితరులు